


## పంచగాయములు

**యెషయా 53: 5** మన అతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగొట్ట బడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగు చున్నది.

కల్వరి ధ్యానం మన హృదయాలను ద్రవింపచేస్తుంది. ఎందుకొరకు యేసు ఇంతగా వేదన నొంది, రక్తము కార్చి, మరణించుటకు కారణం కేవలం మనకు స్వస్థత ఇవ్వడం కొరకో లేక మన బలహీనతలనుండి బయట పడవేయడానికో మాత్రమే కాదు. దానికి ఇంకా బలమైన కారణాలు చాలా ఉన్నాయి.

**పంచగాయములు:**

కొంమంది బైబిల్ పండితుల ప్రకారము యేసు కల్వరి సిలువలో పొందిన పంచగాయములు

1. కుడి చేతిలో మేకుల గాయము.
2. ఎడమ చేతిలో మేకుల గాయము.
3. కుడి కాలు పాదము మీద మేకుల గాయము.
4. ఎడమ కాలు పాదము మీద మేకుల గాయము.
5. ప్రక్కలో బల్లెపు గాయము.

ఈ ఐదు గాయములను పంచగాయములుగా చెబుతుంటారు. అయితే తలమీద ఉన్న ముళ్ళ కిరీటపు గాయములు, వీపు మీద కొరడా గాయములను పంచగాయములలో చేర్చకపోవడానికి కారణం అవి ఆయన సిలువ మీద ఉన్నప్పుడు పొందినవి కాకపోవడమే. అయితే మరికొంత మంది బైబిల్ పండితులు వేరొక కోణంలో, మరో విధముగా ఈ పంచగాయములను వివరించడం జరిగింది. ఆ విధానము,

**ఐదు గాయముల విభాగాలు**

**1. లోపలి గాయములు: యెషయా 53: 5** మన అతిక్రమక్రియలను బట్టి అతడు **గాయపరచబడెను.** మన దోషములను బట్టి **నలుగొట్ట బడెను.** మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగు చున్నది.

ఆయన గాయపడుట లేదా నలుగగొట్టబడుట కేవలము మన అతిక్రమములను బట్టియే. ఆయన గాయపడింది / నలుగగొట్టబడింది ఆయుధములతో మాత్రమే కాదు కాని వట్టి చేతులతో పిడి గుద్దులు వలన కూడా. అందులో ఎక్కువ గాయములు అంతరంగికముగా ఉంటాయి. బయటికి కనిపించవు. ఇవి మన రహస్య క్రియలను సూచిస్తున్నాయి.

**మత్తయి 26: 67** అప్పుడు వారు ఆయన ముఖము మీద ఉమ్మి వేసి, ఆయనను గుద్దిరి. కొందరు ఆయనను అర చేతులతో కొట్టి క్రీస్తూ, నిన్నుకొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి.

**2. కొరడా దెబ్బల గాయములు: మత్తయి 27:26** అప్పుడతడు వారు కోరినట్టు బరబ్బను విడుదల చేసి, యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయ నప్పగించెను.

కొరడా చివరి భాగములో ఇనుప ముళ్ళు, గాజు ముక్కలు ఉంటాయి. వాటితో కొట్టినప్పుడు ఆ కొరడాతో పాటుగా చర్మము వస్తుంది.

**కీర్తన 129:3** దున్నువారు నా వీపు మీద దున్నిరి. వారు చాళ్లను పొడుగుగా చేసిరి.

అంతగా వారు క్రీస్తును కొట్టారు. వీపు మీద, శరీరము మీద ఉన్న మాంసమంతా వచ్చేసింది. ఎంతలా అంటే ఎముకలు లెక్కించే అంతలా...

**కీర్తన 22:17** నా యెముకలన్నియు నేను లెక్కించగలను. వారు నిదానించుచు నన్ను తేరి చూచుచున్నారు.

మాంసమంతా లాగి వేయబడుట ఎంత వేదన? మాంసమంతా వ్రేలాడుతుంది.

మన శరీరముతో మనం చేసిన దోషము అంతా క్రీస్తు తన మీద వేసుకొని శిక్షను పొందారు.

**3. ముండ్ల కిరీటపు గాయములు:**

**మత్తయి 27:29, 30** ముండ్ల కిరీటమును అల్లి ఆయన తలకు పెట్టి, ఒక రెల్లు ఆయన కుడి చేతిలో నుంచి, ఆయన యెదుట మోకాళ్లూని యూదుల రాజా, నీకు శుభమని ఆయనను అపహసించి ఆయన మీద ఉమ్మివేసి, ఆ రెల్లును తీసుకొని దానితో ఆయనను తలమీద కొట్టిరి.
ఒక ముళ్ళు సుమారుగా 4 లేదా 5 అంగుళాల పొడవు గలది. ఆయన తలలో ముండ్ల కిరీటములో ఉన్న ఇలాంటివి ఎన్ని ముళ్ళు గ్రుచ్చుకొని ఉంటాయో మనము సులభముగా గ్రహించవచ్చును. ఇవన్నీ మరచి పోకూడదు. ఈ గాయములు మనము మన తలంపులతో చేసిన పాపములను పరిహరించడానికి పొందినవి. అందుకే సిలువను గూర్చిన ధ్యానం మన హృదయాన్ని క్రొవొత్తు వలే ద్రవింపజేస్తుంది.
**4. మేకుల గాయములు:**
**యోహాను 20: 25** గనుక తక్కిన శిష్యులు మేము ప్రభువును చూచితిమని అతనితో చెప్పగా అతడు నేనాయన చేతుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను.

**కీర్తన 22:16** కుక్కలు నన్ను చుట్టుకొని యున్నవి. దుర్మార్గులు గుంపుకూడి నన్ను ఆవరించి యున్నారు. **వారు నా చేతులను నా పాదములను పొడిచి యున్నారు.**

ఆ మేకులు దాదాపు 13 అంగుళాల పొడవు, అర యించు వ్యాసార్థం గలవి.

ఈ గాయములు మనము మన చేతులతో, కాళ్లతో చేసిన పాపములను సూచిస్తున్నవి.

**5. ప్రక్కలో బల్లెపు గాయం:**

**యోహాను 19: 34** సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను. వెంటనే రక్తమును, నీళ్లును కారెను.

ఇది మన హృదయాంతరంగాలలో మనం చేసిన దోష శిక్షను చూచిస్తుంది.

అయితే ఈ పంచగాయములు ఎవరి కోసము, ఎందుకోసము క్రీస్తు పొందుకున్నాడు? ఒక సంతానము కొరకు....

**యెషయా 53: 10** అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే అపరాధపరిహారార్థ బలిచేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశములు అతని వలన సఫలమగును.

ఈ సంతానము ఎవరు?

**కీర్తన 22:30** ఒక సంతతి వారు ఆయనను సేవించెదరు. రాబోవు తరమునకు ప్రభువును గూర్చి వివరింతురు.

ఒక సంతతి కలదు.వారు తరములు ఆయనను సేవించేవారు... ముగింపులేని సంతానము...

**ప్రకటన 22:4,5** ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేయు చుందురు. ఆయన నామము వారి నొసళ్లయందుండును. రాత్రి యికనెన్నడు ఉండదు. దీపకాంతియైనను సూర్యకాంతియైనను వారికక్కర లేదు. దేవుడైన ప్రభువే వారి మీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు.

దైవ భక్తిగల ఆ సంతానమును నిత్యము తనతో పాటుగా రాజ్యమేలుటకు,

**కొలొస్సీ 2: 14, 15** దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండా దానిని ఎత్తివేసి మన అపరాధయులనన్నింటిని క్షమించి, ఆయనతో కూడా మనలను జీవింపజేసెను. ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను.
దైవ భక్తిగల ఆ సంతానములో చేరే ధన్యత దేవుడు మనందరికి దయచేయును గాక. ఆమేన్